# సంపాదకీయం

అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు!!

సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే/సంక్రమించే సమయము కాబట్టి మకర సంక్రమణం లేదా మకర సంక్రాంతిగా పేర్కొని మూడురోజులు వరుసగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగను పెద్ద ఎత్తున మన భారతదేశంలోనూ మరియు భారతీయులు నివసిస్తున్న వివిధ దేశాల్లో కూడా కలసికట్టుగా ఒకచోట చేరి ఈ ముచ్చటైన అచ్చతెలుగు సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం గమనార్హం. ఇదే సమయంలో ప్రస్తుత యాజమాన్యం నుండి నూతన కార్యవర్గం మన తెలుగు సంఘం బాధ్యత పగ్గాలు చేపడుతుంది.

"లేట్ గా వచ్చినా, లేటెస్ట్ గా వస్తా" అన్నట్లుగా మన ప్రస్తుత టి.ఏ.జి.బి అధ్యక్ష బృందం తమ ఆధ్వర్యంలో ఈ “దుర్ముఖి నామ సంవత్సర ఉగాది” కార్యక్రమాలను చక్కని సాంప్రదాయ బద్ధమైన స్వాగత అలంకరణలతో మరియు ఉగాది పచ్చడితో ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన వారికి ఇది ఒక చక్కని అనుభూతిని కలిగించింది. ఎన్నో చక్కని సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఈ ఉగాదికి ఔత్సాహికులను, వారిలో వున్న ప్రతిభలను వెలికితీసే ప్రయత్నంలో భాగంగా ఫోటోగ్రఫి పోటీలు మరియు కుకీ డెకొరేషన్ పోటీలు కూడా నిర్వహించి విజేతలను యథావిధిన సత్కరించటం జరిగింది.

బోస్టన్ పరిసర ప్రాంతాల తెలుగు వారు ఎంతో ఆసక్తిగా పాల్గొనటానికి ఎదురు చూసే ఆటల పోటీలలో ఒకటి మన టి.ఏ.జి.బి అధ్యక్షతన నిర్వహించబడే క్రికెట్ టోర్నమెంట్. ఈ సారి ఆగస్ట్ 14 న "IV Invitational Cricket Tournament:Telugu Premier Leauge(TPL.... ఇది చాలా హాట్ గురూ) 2016" నిర్వహించటం జరిగింది. ఈ సారి కూడా పాల్గొన్న క్రీడాకారులు ఎంతో ఉత్సాహంతో ఆడి చూపరులను తమ క్రీడా నైపుణ్యంతో ఆశ్చర్యానంద చకితులని చేసారు. ఇక మన టి.ఏ.జి.బి నిర్వహించే టెన్నిస్ టోర్నమెంట్ కి వచ్చే స్పందన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఆగస్ట్ 27 న జరిగిన ఈ పోటీలలో చిన్న పిల్లలు,పెద్దవాళ్ళు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ రెండు టోర్నమెంట్ల లోని విజేతలకు బహుమతులు ఇవ్వటం జరిగింది.

అంతేకాకుండా, మన టి.ఏ.జి.బి ఏర్పడి 30 వసంతాలు పూర్తిచేసుకున్న తరుణంలో అక్టోబర్ 8 న మన ప్రస్తుత అధ్యక్ష బృందం వార్షికోత్సవం వేడుకలను శ్రీ సీతారామకల్యాణం తో ప్రారంభించి కార్యక్రమాలు అన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన అన్ని కార్యక్రమాలు కూడా ఆహ్వానితులందరినీ ఎంతో అలరించాయి.

ఈ నాటి సంక్రాంతి సంబరాలు కూడా చాలా సందండిగా జనరంజకంగా సాగాయి. మన సంక్రాంతి సంబరాలల్లో భాగంగా, సంగీత సామ్రాట్ శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి సంస్మరణార్థం ఘన నివాళులు అర్పిస్తు శ్రీమతి పద్మజ బాలా గారి బృందం చక్కని సంగీత గానామృతములతో ప్రేక్షకులని మంత్ర ముగ్ధులని చేసారు.ఇక శ్రీమతి శైలజా చౌదరి గారి శిష్య బృందం చేసిన "చండాలికా" నృత్య రూపకం సంక్రాంతి వేడుకలకు మరింత వన్నె తెచ్చింది. ప్రేక్షకులు ఈ కార్యక్రమాలలోని వైవిధ్యాన్ని చూసి సంతోషించారు.

ఈ సంవత్సరమంతా మీరు మా ఈపత్రిక కి చూపించిన ఆదరణ కి కృతజ్ఞతలు. తిరిగి వచ్చే “శ్రీ హేవళంబి నామ సంవత్సర ఉగాది” కార్యక్రమాల ముచ్చట్లతో మీ ముందుకు వస్తాము.

***ు మాట్లాడంది మీ పిల్లల చేత కూడా మాట్లడించండి   మీరు తెలుగు ,***
***ంచండి .***

నమస్తే!

మీ ఎడిటర్ ఇన్ చార్జ్ ,

కిరణ్మయి చతుర్వేదుల

## అధ్యక్షుని సందేశం



కాలమంటే ప్రమాణాలకు లొంగనిది అయినా ఒక క్రమంలో లొంగ తీసి కల్పాలుగా, యుగాలుగా, సహస్రాబ్దులుగా, శతాబ్దులుగా, వత్సరాలుగా నిర్ణయించినా మనం దాన్ని మాత్రం జయించలేము కదా. ఒక సంవత్సరం ఇంకా నిన్న మొన్నలుగా రూపాంతరం చెంది తొలి వసంతం కుహు కుహూల కూజితాలను పలికినట్టే ఉంది, ఇంతలోనే చలి పంజాలను విసిరే మంచు జడులను దాటేస్తూ, సంక్రాంతి సంబరాలనూ చేసుకోవాలనే మరొక్క విజయ నికేతనం ఎగరవేస్తూ , విజయాల వారధిలో మరొక్క మెట్టును కలుపుతూ క్రొత్త సంవత్సరంలోకి పరిగెట్టేస్తున్నాము.

మున్ముందుగా ఈ అవకాశం కల్పించిన తోటి తెలుగు వారందరికీ నా నమస్సుమాంజలులు. ఎన్నో చెయ్యాలన్న తపనతో, తోటి తెలుగు వారందరినీ సమైఖ్య పరచి, మరింతగా ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఈ బోస్టన్ నగరంలో తెలుగు వెలుగు రవ్వలను ప్రజ్వలింపచెయ్యాలన్న తపనతో క్రిందటేడు సారథ్య బాధ్యతల పగ్గాలను కమిటీ వారు అందించినప్పటినుంచి కమిటీను, ఇంకా అనేక మంది ఔత్సాహికులను, సేవాతత్పరత కలిగిన అన్నాతమ్ముళ్ళను, అక్కాచెల్లెళ్ళను తోడుగా తీసుకుని సాగిన ఈ పయనంలో చెప్పుకోదగ్గ మైలు రాయిలెన్నో, నేర్చుకున్న పాఠాలెన్నో.... ఈ రోజు అందరితో కలిసి మరొక్క మారు సింహావలోకనం చేసుకోవాలని ఉంది.

చలి ప్రపంచంలో బ్రతికే మనకు వేసవొక ఆటపాటల విడిదే కదా, దానిని సద్వినియోగం చేసుకుని మన క్రీడల కమిటీ వారు బాడ్మింటన్ టోర్నమెంట్స్, క్రికెట్ టోర్నమెంట్స్ మొదలైన ఆటలను.... మరిచిపోయిన మన చిన్ననాటి సరదాలను నవ్వుల పూల గుత్తులతో పూయించి, ఆటలను వేసవి ఒడ్డుల సాగే అందమైన సాయంత్రపు నడకలను చేసి అందరికీ పంచారు. ఇక  ఉగాదుల సంబరాలను, వేసవుల పిక్నిక్కులను మల్లె, కనకాంబరాల కదంబంలా అందిస్తే, మన 30 సంవత్సరాల సభను కిరీటంలో కలికితురాయి చేసుకున్నాము

కదా సమిష్టి కృషితో... ఎంతోమంది కలిసి చేయి చేయి గా కలిపి సాగిన ఈ సమిష్టి కృషి మన హరిబాబు గారు, మోహన్ నన్నపనేని గారు, ప్రకాష్ రెడ్డి గారి వంటి పురప్రముఖుల సాయంతో మరింత దేదీప్యమానంగా వెలిగింది.

సాహిత్య, సాంస్కృతిక సాంప్రదాయలకు పెద్ద పీట వేయటానికి ఎన్నో మంచి రూపకాలు, నాటికలు, గల్పికలు మీ ముందు ప్రదర్శించటమే కాక, ఈ-పత్రికను దిగ్విజయంగా అన్ని సంచికలలోనూ విలువలను, సరదాలను, ఉత్సుకతలనూ తగ్గకుండా నడిపి ముందు రాబోయే కమిటీ వారికి కరదీపికను అందిస్తున్నాము.

ఇక ఈ సంక్రాంతి వేడుకలను జానపదుల గానాలతో, పల్లె శోభల మెరుపులతో ఇక్కడే మన మధ్యే మన ఊరిని తలపించే ఆప్యాయతల, మమతల సిరులను కురిపిస్తూ, ఆనాటి వంటల రుచులను మరిపిస్తూ చేసుకుంటానికి సమాయత్తమయిపోతున్నాము. అంతే కాదు.... మన టీఏజీబీ కమిటీ వారు ఈ సంవత్సరపు కానుకగా మన సంస్థ కోసం మనకంటూ సమకూర్చుకున్న స్థిరాస్తుల, చరాస్తులను మన వచ్చే సంవత్సరపు కమిటీకి విజయ కేతనపు దరహాసాలతో కలిపి ఇచ్చెయ్యటానికి కూడా.....

హెరాక్లిటస్ అనే తత్వవేత్త, 'అదే నదిలో నువ్వు రెండు సార్లు అడుగుపెట్టలేవు.. క్రొత్త జలాలెప్పుడూ నీ మీంచి ప్రవహించిపోతుంటాయి కనుక' అన్నట్టు, సాగే కాలంతో పాటూ కదిలిపోతూ, క్రొత్త సంవత్సరం క్రొత్త కమిటీకి శుభాబినందనలు తెలుపుతూ, మీ ముంగిట మరెన్నో విజయాల ప్రోది పడాలని కోరుతూ, ఈ అవకాశం ఇచ్చిన అందరికీ నమస్సులతో

మీ
చంద్ర తాళ్ళూరి.

## హరి బాబు గారి సందేశం

జీవితం నాకెన్నో పాఠాలు చెప్పేటప్పుడు దానిని నేను ఎంతో అసహ్యించుకున్నాను. అప్పుడప్పుడు దానిని దండించాను కూడా.... కొంతమేరకు జీవితాన్ని అనుభవాల పరిగణలోకి తీసుకున్నాక, ఇతరత్రా నాకు అర్ధమయ్యిందేమిటంటే సార్వత్రిక కారణం (universal cause) అనేది ఒక చలి తుఫాను లాంటిది. దానితో ప్రతి ఒక్క దానిని ఎగరేసుకు పోతుంది. మనిషీ... నీ ప్రవృత్తి కి ఏది అవసరమో అది చేయి. నీకేది చేతనవునో అది మొదలెట్టు. ప్రక్కవాళ్ళు ఎవరైనా చూస్తున్నారా లేదా అన్నది పట్టించుకోకు. చివరికి ప్లేటో రిపబ్లిక్ ను కూడా పట్టించుకోకు. ఒక చిన్న పనైనా సక్రమంగా జరిగిందా తృప్తి చెందు. అలా జరగటమేమి చిన్న విషయం కాదని గుర్తించు..... మార్కస్ అరీలియస్ -- తత్వ శాస్త్రవేత్త

ఈ పై మాటలు ఇంత ఘాడతతో కాకపోయినా మన జీవితాలలో ఏదో ఒక సమయంలో ఈ అర్ధం గోచరించేటట్టు మనకు తగినరీతిలో అంటూనే ఉంటాము, వింటూనే ఉంటాము... ఆలోచిస్తే ఈమాటలలో ఎంత సత్యం స్ఫురిస్తుంది కదూ... తోచినంత వరకు మంచి చేసుకుంటూ తోటి వారిని కలుపుకుంటూ సాముహికంగా సామాజికంగా కలిసి నడవటమే కదా జీవితం.... కలసి సామాజికంగా నడవటంలో అందులో వలస పక్షులమైన మనం మనకంటూ ఒక ఉమ్మడి సంఘాన్ని అస్థిత్వాన్ని ఏర్పరుచుకోవటంలో భాగమే కదా ఇక్కడి మన టీ.ఏ.జీ.బీ కూడా.

మనకెంతో ఇచ్చిన మన సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇచ్చే భాగంలో నన్ను కూడా భాగస్వామ్యులను చేసినందుకు అందరికీ ధన్యవాదాలు. గత ఏడాదిగా కమిటీ చైర్మెన్ గా కమిటీ పని తీరులను, బాగోగులను చూసుకునే ప్రయత్నంలో అందరూ చేసే కృషి చూశాక మన టీ.ఏ.జీ.బీకు స్వర్ణ యుగం రానున్నదన్న ఆలోచన నాకు తోచింది. అందులో భాగంగానే మొన్నటి ౩౦ సంవత్సరాల సంబరాలను ప్రతిష్టాత్మకంగా మన ప్రెసిడెంట్ చంద్ర తాళ్ళూరి గారి సారధ్యంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు ఇతర నిర్వాహక సభ్యులు కలసి నిర్వహించిన తీరు తేటతెల్లం చేసింది. ఒక కార్యక్రమం

సక్రమంగా నడవాలంటే సార్థ్య బాధ్యతలు, తోడ్పాటులో అందరి సమన్వయం ఉండాలి, అది మన మధ్యన పూర్తి స్థాయిలో ఉన్నందుకు నాకు ఎంతో గర్వంగాను, సంతోషంగానూ ఉంది. ఈ-పత్రికలో మన టీ.ఏ.జీ.బీ ఆవిర్భావం, దాని ప్రాభవ, విభవాలు పెరిగిన తీరులో తోడ్పడిన వాళ్ళందరి గురించి వ్రాయటం ఎంతైనా ముదావహం.

ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు. మన నన్నపనేని మోహన్, ప్రకాష్ రెడ్డి, దాసరి అమ్మాణి గారు ఎందరో పుర ప్రముఖులు ఈ సంస్థ ఎదుగుదలలో వారి సహాయసహకారాలను అందించారనటంలో ఏమి సందేహం లేదు. అలానే ఎందరో పేర్లు రాస్తూ పోతే, ఎన్ని కాగితాలనైనా నింపగలంత మంది ఈ సంస్థ కోసం వారి కాలాన్ని, శక్తిని, ఇతోధికంగా ధనాన్ని అందిచారనటంలో మన కోసం మనమందరం అనే ఒక ఉమ్మడి ఉన్నత కారణం తోస్తోంది.

ఈ తోడ్పాటు ఎప్పటికీ ఇలానే సాగి మన టీ.ఏ.జీ.బీ ఎన్నెన్నో ప్రముఖ సంస్థల ప్రక్కన నిలవగలిగి ఇక్కడి మన వాళ్ళకు, మన మూలాలు నిలిచిన మన దేశానికి, మన రాష్ట్రాలకు కూడా స్ఫూర్తిమంతమై నిలవాలని ఆశిస్తూ అందరికీ శుభాబినందనలు.

## తన దాకా వస్తే

—— రోజా

సుబ్బారావుకి చాలా చిరాకుగా వుంది ఈవేళ. నిన్న రాత్రి భార్య, లక్ష్మితో వివాదం జరిగింది. స్నేహితుడు, సత్యనారాయణ వ్రతం చేసుకుంటున్నారు వెడదామని అంటే రానని చెప్పింది, అతని భార్య. వీకెండ్ వచ్చింది సరదాగా వెడదామని తను చెబితే రావడానికి తనకు ప్రాబ్లమ్ ఏమిటి? తను ప్రొద్దున్న క్రికెట్ ఆడుకుని వస్తాడు. ఈ లోపు పనులు పూర్తి చేసుకుని రెడీ అయి ఉండవచ్చు కదా. ఎక్కడికి వెడదామని అన్నా ఎప్పుడు ఏదో ఒక సాకు చెపుతుంది. ఒక్క సరదా లేదు. ఎప్పుడూ ఏదో పని ఉంది అంటుంది. పెద్ద ఈవిడగారు ఒక్కతే పని చేస్తున్నట్లు ఈ ప్రపంచంలో. లక్ష్మి మూలంగా తన జీవితంలో ఎలాంటి సుఖం లేకుండా పోయింది. తనకు ఎంతసేపు పని మీద ధ్యాస తప్పితే కొంచెం సరదాగా గడుపుదామని అనిపించదు; తన ఆరోగ్యం మీద కూడా ధ్యాస లేదు. తాను లావుగా ఉంటుంది. కానీ బరువు తగ్గడానికి ఏమి ఎక్సరసైజ్ చెయ్యదు. నేను ఆమాటే చెప్పితే అక్కడి నుంచి లేచి వెళ్ళి పోతుంది. తాను అన్నా, తన మాట అన్నా లక్ష్యం లేకుండా పోతోంది.

**************

చిరాగ్గానే ఆఫీసులో పని పూర్తి చేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఇంట్లో, క్రొత్తగా పెళ్ళి అయి భర్తతోపాటు చెన్నైలో ఉంటున్న కూతురు, పావని, సోఫాలో కూర్చుని వుంది. ముఖం బాగా ఏడ్చినట్లు తెలుస్తోంది. ప్రక్కనే లక్ష్మి కూర్చుని వుంది. కూతురు ని అలా చూడగానే మనస్సులో భయం కలిగింది ఏమై వుంటుందా అని. కంగారుగా "ఏమ్మా! పావని! ఇదేనా రావటం? చెన్నైలో అల్లుడు, రాజీవ్, కులాసానా? అంతా ఓకేనా?" అని అడిగాడు.

"డాడీ!" అంటూ ఒక్కసారిగా సుబ్బారావుని పట్టుకుని ఏడ్చేసింది పావని. "పావని! ఏమైందమ్మా! ఎందుకు ఏడుస్తున్నావు? రాజీవ్, నువ్వు ఏమైనా గొడవ పడ్డారా? అల్లుడు గారు నిన్ను ఏమైనా అన్నారా?" అని సుబ్బారావు ఆందోళనగా అడిగాడు. ఏమి తోచక లక్ష్మి కేసి చూసాడు. లక్ష్మికి కూడా ఏమి అర్థం కావడం లేదు. "మధ్యాహ్నం 4 గంటలకి వచ్చినప్పటినుంచి పావని ఏమి చెప్పటం లేదు. మీతోనైనా ఏమైనా చెపుతుందేమోనని అనుకున్నాను" అంది.

ఏమి చెయ్యాలో తెలియని పరిస్థితి. ఎంతో చెలాకీగా ఉండే పిల్ల, చదువుకున్నది, ఉద్యోగం చేస్తున్నది, క్రొత్తగా పెళ్ళి అయిన పిల్ల ఆలా మౌనంగా ఏడుస్తుంటే ఏ తల్లిదండ్రులకైనా ఏమి అనిపిస్తుంది. కాసేపాగి లక్ష్మి లేచి టీ

తెచ్చి సుబ్బారావుకి, పావనికి ఇచ్చింది. పావని ఏమి మాట్లాడకుండా టీ త్రాగింది. సుబ్బారావు, లక్ష్మి కూడా మౌనంగానే టీ త్రాగటం ముగించారు. ఆ తరువాత "పావని! కాస్త విశ్రాంతి తీసుకో తల్లీ! ప్రయాణం బడలిక తీరుతుంది. రేపు శనివారం కదా. తీరికగా మాట్లాడుకుందాం" అంటూ సుబ్బారావు బట్టలు మార్చుకోవడానికి బెడ్ రూమ్ లోకి వెళ్ళాడు.

రాత్రి భోజనాలలోకి పావనికి ఇష్టం కదా అని లక్ష్మి కొబ్బరి, మామిడి కాయ పచ్చడి, ఆలుగడ్డ వేపుడం, టమాటో చారు పెట్టింది. మామూలుగా అయితే ఎంతో హుషారుగా మాట్లాడుతూ తన కిష్టమైన పదార్ధాలు తినే పావని, ఈ రోజు ఎంతో ముభావంగా నాలుగు మెతుకులు తిని లేచి తన రూమ్ లోకి వెళ్ళి పోయింది. సుబ్బారావు, లక్ష్మి కూడా భోజనం అయింది అనిపించారు. లక్ష్మి డైనింగ్ టేబుల్ శుభ్రం చేసి, వంటింట్లో తన పని ముగించుకుని, లైట్లు ఆర్పి బెడ్ రూమ్ లోకి వచ్చింది. అప్పటి వరకు పేపర్ చదువుతున్న సుబ్బారావు, అది ప్రక్కన పెట్టి లక్ష్మితో "పావనిని ఇప్పుడేమి అడక్కు. దానికి టైం ఇవ్వు. రెండు రోజులు చూద్దాము. అప్పుడు కూడా అది ఏమి చెప్పకపోతే నేను మాట్లాడతాను." అన్నాడు. లక్ష్మి ఏదో చెప్పబోయి ఆగిపోయింది.

**********

తెల్లవారింది. శనివారం, ఆఫీసుకి సెలవు. సుబ్బారావు ఆరు గంటలకే లేచి క్రికెట్ ఆడుకోవడానికి వెళ్ళిపోయాడు. వచ్చేసరికి మధ్యాహ్నం పన్నెండు అయింది. స్నానం చేసి వచ్చేసరికి బాగా ఆకలి వేసింది. లంచ్ కి లక్ష్మి పాలకూర పప్పు, వంకాయ కూర చేసింది. భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం వాక్ కి ఒంటరిగా వెళ్ళి వచ్చాడు సుబ్బారావు. మనస్సు ఏమి బాగోలేదు పావనిని అలా దిగాలుగా చూస్తూంటే. స్నేహితుడి ఇంటికి కూడా వెళ్ళాలని అనిపించలేదు సత్యనారాయణ వ్రతానికి. ఆ సాయంత్రం ఎవరూ మాట్లాడలేదు. డిన్నర్ చేసి ఒక గంట సేపు టీవీ చూసి పడుకున్నాడు సుబ్బారావు. ఇలాగే ఆదివారం కూడా గడిచింది. అల్లుడు, రాజీవ్, కూడా ఫోన్ చెయ్యలేదు. పావని కూడా మాట్లాడటం లేదు.

సుబ్బారావుకి ఆందోళనగా ఉంది. ఏమై ఉంటుంది. బంగారం లాంటి పిల్ల, నవ్వుతూ, తుళ్ళుతూ ఉండే తన కూతురు ఎందుకో దిగులుగా ఉంది. ఏమి చెప్పదు. దిగాలుగా ఏడుస్తూ తన రూం లో కూర్చుని ఉంటోంది రెండు రోజులుగా. తల్లితో కూడా ఏమి చెప్పదు. అన్ని విషయాలు తనతో చర్చించే పిల్ల తనతో కూడా ఏమి చెప్పట్లేదు. ఇక అల్లుడినే అడగాలి రేపు అని నిర్ణయించుకున్నాడు. "నాజూకుగా, అందంగా ఉండే పావని ఎందుకో బాగా ఒళ్ళు చేసింది. ఇంకా పిల్లలు కలగకుండానే పాతికేళ్ళకే ఇలా ఉంటే డయాబిటీస్ మొదలైన రోగాలు రావూ? ఆశ్చర్యంగా ఉంది. తన శరీర ఆరోగ్యం గురించి ఎంతో జాగ్రత్త తీసుకునే తన కూతురు, తల్లిని లావుగా ఉందని నాతో కలిసి ఆట పట్టించే పిల్ల ఇపుడు తనే లావెక్కింది. ఏమిటో కారణం తెలీదు, అడగాలి" అనుకున్నాడు సుబ్బారావు.

భార్య లక్ష్మి మీద కోపం వస్తోంది. ఆ మాత్రం కూతురితో మాట్లాడి విషయం తెలుసుకోలేక పోయింది. అన్నీ నేనే చూసుకోవాలి. తనకి ఆరోగ్యం మీద శ్రద్ధ లేదు. లావెక్కి పోయింది. తను చేతనైనంత వరకు పనిలో సాయం చేస్తాడు. ఇంటి పనులు చేసుకోవడం అంత కష్టమా? తను బయటికి వెళ్ళి ఉద్యోగం చెయ్యడం లేదా? అయినా ఇంటికి వచ్చి మళ్ళీ క్రికెట్ కి, వాకింగ్ కి వెడుతున్నాడు కదా? తను కూడా చదువుకున్నదే. బాంకు లో క్లర్కుగా చేస్తోంది. ఇంటికి వచ్చిన తరువాత కూడా పనిలో పడుతుందే కాని వాకింగ్ చెయ్యదు. ఆమెని తను కాబట్టి భరిస్తున్నాడు. ఇంకొకరు అయితేనా ఏమి చేసేవారో.

సోమవారం ప్రొద్దున్న ఎనిమిది గంటలకి సుబ్బారావు అల్లుడు, రాజీవ్ కి ఫోన్ చేసాడు. "హలో! బాబు రాజీవ్! నేను పావని నాన్నని. నువ్వు కులాసానా?". అవతలి ప్రక్క నుంచి "ఆ కులాసా. మీరు, అత్తయ్యగారు ఎలా ఉన్నారు?" అన్నాడు రాజీవ్. "బాగానే ఉన్నాము బాబు. పావని మొన్న శుక్రవారం ఇక్కడికి వచ్చింది. ఏడుస్తూ కూర్చుని ఉంది. మీరు ఇద్దరు ఏమైనా గొడవ పడ్డారా?" అడిగాడు సుబ్బారావు.

దానికి అవతల ప్రక్కనుంచి రాజీవ్ వెంటనే సమాధానంగా, "నేను తనని హింసిస్తున్నానని చెప్పిందా మీ అమ్మాయి మీకు? అంతే లెండి ఎంతైనా మీరు మీ అమ్మాయి మాటలు నమ్ముతారు. అయినా ఇంతా చేసి నేను ఏమి అన్నానని. ఇంకా పిల్లలు లేకుండానే పాతికేళ్ళకే ఇలా లావెక్కావు, ఇక రేపు ఇద్దరు పిల్లలు పుడితే ఇంకెంత లావెక్కుతావో. కాస్త తిండి తగ్గించి ఎక్సరసైజ్ చెయ్యవచ్చు కదా. పెళ్ళికి ముందు చక్కగా నాజూకుగా ఉండేదానివి. ఈ ఆర్నెల్లలోనే రోడ్ రోలర్ లా తయారు అయ్యావు అని ఉన్న మాటేగా చెప్పాను. తన ఆరోగ్యం గురించేగా చెప్పాను." అన్నాడు. ఆ మాటలు సుబ్బారావు చెంప మీద చాచికొట్టినట్లుగా అనిపించింది. ఈ మాటలని తను తన భార్య, లక్ష్మి, ని గురించి చెప్పినవే. తన స్థానంలో తన అల్లుడు నిల్చుని ఉన్నాడు. తన కూతురు, అల్లుడు అన్న మాటలకి అంత ఏడుస్తోంది అంటే మరి తన మాటలకి లక్ష్మి కూడా బాధ పడి ఉంటుందా? తను ఏనాడూ లక్ష్మి మనస్సు గాయపడుతుందేమోనని ఆలోచించలేదే. తన మాటలని వినిపించుకోలేదని, లావెక్కుతోందని కోపగించుకున్నాడే కానీ, ఆమె నాకు గర్భ నిరోధక మాత్రలు పడటం లేదని, లావెక్కుతున్నానని ఎంత చెప్పినా పట్టించుకోలేదు. ఎంత సేపు తనని వెక్కిరించడం, మాటి మాటికి తను లావు అని గుర్తు చేసాడు. సన్నగా ఉన్న వాళ్ళతో పోల్చి చూపాడు. అలాంటి సందర్భాలలో లక్ష్మి మౌనంగా అక్కడి నుంచి వెళ్ళిపోవడాన్ని పొగరు అని అన్నాడు. తనకి ఎవ్వరితోను కలవడం ఇష్టం ఉండదని నలుగురితోను చెప్పేవాడు. రాను రాను తను తన ఆఫీసు పని, ఇంటి పని, పావని పెంపకంలో బిజీ అయింది. తను ఉద్యోగం, క్రికెట్, తన స్నేహితులని కలవడంతో బిజీ అయ్యాడు. తనకి ఏమైనా ఇష్టాలు, అఇష్టాలు ఉంటాయా అని ఆలోచించలేదు. తను క్రికెట్ మాచ్ ని టీవీలో, కంప్యూటర్లో చూస్తూ, తను ఏదైనా తెలుగు సినిమా చూస్తే "చెత్త" అని ఎన్ని సార్లు అన్నాడో. తను క్రికెట్ ఆడటం ఈర్ష్యతో చూడలేక పోతోందని అనుకున్నాడు. ఎంతసేపు వాట్సాప్ లో క్రికెట్ గురించి, ఫోన్లో క్రికెట్ గురించి మాట్లాడుతూ ఉంటాడు. అది తనకి ఇష్టం లేదా? తను చెప్పడానికి కూడా ప్రయత్నం చేసింది. ఈర్ష్య తో అలా అంటోందని అనుకున్నాడు. అన్నాడు కూడాను ఆమెతో. నీకు నలుగిరితో కలవడం, మాట్లాడటం తెలియదు అన్నాడు. ఎంతసేపు పని అంటూ కూర్చుంటావు. చెత్త సినిమాలు చూస్తూ, ఏడుస్తూ ఉంటావు. నీ ఏడుపు ముఖం చూడాల్సి వస్తే వీకెండ్ కి కూడా ఇంట్లో ఉండాలని అనిపించదు అని పదే పదే అన్నాడు. ఆమెని తన మాటలు ఏమైనా బాధ పెట్టాయా అని ఆలోచించలేదు. ఆలోచనలో పడ్డ సుబ్బారావు అవతల ప్రక్క అల్లుడు సమాధానం లేక ఫోన్ కట్ చేయడం కూడా గుర్తించలేదు. ఎంతో సేపు అలా కూర్చుండి పోయాడు.

ఈ రోజు పావనిని చూసేదాకా తనకు అర్ధం కాలేదు తను లక్ష్మి ని ఎంత బాధ పెట్టాడో. అలా చాలాసేపు కూర్చుని ఆలోచించిన తరువాత సుబ్బారావు ఒక నిర్ణయానికి వచ్చాడు. పావనితో మాట్లాడితే అతని అనుమానం నిజం అయింది. పావని గర్భ నిరోధక మాత్రలు వేసుకోవడం మొదలు పెట్టిన తరువాతే లావెక్కడం మొదలు అయింది. రాజీవ్ మాటలు ఆమెకి బాధ కలిగించాయి. దెబ్బలాట పెట్టుకుని అక్కడి నుంచి వచ్చేసింది. విషయం తెలిసిన తరువాత తన కూతురి కాపురం నిలపాలంటే ఏమి చెయ్యాలో అర్ధం అయ్యింది సుబ్బారావుకి. సుబ్బారావు పావనికి రాజీవ్ గురించి నచ్చ చెప్పి తిరిగి చెన్నై తీసుకుని వచ్చాడు. రాజీవ్ తో మాట్లాడి నచ్చ చెప్పాడు. పావనిని డాక్టర్ కి చూపించి మందులు మార్పించాడు. Gym లో జాయిన్ చేయించాడు.

**************

తిరిగి హైద్రాబాద్ వచ్చిన సుబ్బారావు ఇపుడు ప్రతి రోజు సాయంత్రం నేరుగా ఇంటికి వచ్చి లక్ష్మి కి పనిలో సాయం చేసి ఆ తరువాత వాకింగ్ కి తీసుకుపెడుతున్నాడు. క్రికెట్ కొంచెం తగ్గించి తనతో పాటు సినిమా చూస్తున్నాడు. శని, ఆదివారాలు లక్ష్మి తో గడుపుతున్నాడు. పావని రోజు ఫోన్ లో మట్లాడుతూనే ఉంది. తెలియకుండానే మూడు నెలలు గడిచాయి. మెల్లగా పావనిలో మునపటి చలాకీతనం వస్తోంది. లక్ష్మి కూడా హుషారుగా ఉంటోంది. నలుగురిలోకి వెళ్ళడానికి, మట్లాడటానికి ఉత్సాహం చూపిస్తోంది.

ఒక రోజు సుబ్బారావు, లక్ష్మి కూర్చుని టీవీలో వస్తున్న సినిమా చూస్తుండగా పావని దగ్గర నుండి వాట్సాప్ మెసేజ్

వచ్చింది.  మునుపటిలాగానే నవ్వుతూ, ఎంతో సంతోషంగా  పావని, రాజీవ్ అపుడే తీసుకున్న ఫోటో.  అదే సమయంలో, సుబ్బారావు కళ్ళకి ఎదురుగా పెళ్ళి నాటి లక్ష్మి నవ్వుతూ కనిపించింది .

## తాయిలం

సేకరణ: దీప్తి గోరా **సరసము**

**విరసమైనవేళ:**

ఆరుద్ర గారొకసారి వారి ఊరినుండి వచ్చిరాచకొండ విశ్వనాథశాస్త్రిని చూడటానికి వాళ్ళింటికెళ్ళారట. ఇద్దరూ పక్కపక్కనే కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. అప్పుడక్కడకు ఆరుద్రకు బాగా తెలిసిన ఆయన బంధువు ఒకాయనొచ్చాడట. ఆయన ఆరుద్రను చూడగానే "ఏమండీ ఆరుద్రగారూ! మీరు మద్రాసులో అదే ఇంట్లో ఉంటున్నారా?" అని అడిగాడట. అందుకు ఆరుద్ర చమత్కారంగా "అదే ఇల్లు. అదే ఇల్లాలు" అని టక్కున సమాధానం చెప్పాడట. తమాషా మాటలైనా రా.వి.శాస్త్రి ఫీలయ్యాడట. ఎందుకంటే రా.వి.శాస్త్రి గారికి రెండిండ్లు, ఇద్దరు భార్యలు అట. రా.వి.శాస్త్రి గారు చాలా నొచ్చుకున్నారట ఆరుద్రతో మాట్లాడటం మానేశాడట!

మాటలు కోటలు దాటినా ప్రమాదమే-మనసుని నొప్పించినా ప్రమాదమే సుమా!!

**జంట కవిత్వం తంటాలు**

ఒకానొకసారి దీపాల పిచ్చయ్య శాస్త్రి, గుఱ్ఱం జాషువా కలిసి జంటకవిత్వం రాద్దామనుకున్నారు. పాలు తేనెలా కలిసే పేర్లకోసం ప్రయాస పడసాగారట. ఒక మంచి పేరు పెట్టుకుందామనుకున్నారు- “దీపాల జాషువా”, “గుఱ్ఱం పిచ్చయ్య”, “పిచ్చయ్య జాషువా”, “గుఱ్ఱం దీపాల”, “గుఱ్ఱం శాస్త్రి” .. ఇలా అన్ని రకాలుగా చూస్తే సరైన పేరే కుదరలేదు. అప్పుడు "మనకు పేరే కుదరటంలేదు- ఇక జంటకవిత్వం ఎందుకులే" అనుకొని మానేశారుట! విడివిడిగానే ఆణిముత్యాలని అందించారు.

స్నేహం ఒకవరం, ఒక సరళమైన సున్నితమైన భావం. తిరుపతి వేంకట కవుల్లాగా, బాపు రమణల్లాగ మమైకమై, రాగద్వేషాలకి, అసూయ అబద్ధాలకి అతీతమై ఒకరి ప్రతిభ వేరొకరు వెలికి తేయడానికి చాలా ఉన్నతమైన వ్యక్తిత్వం కావాలి.

**తెలుగుకి జేజే**

| | |
|---|---|
| మంచి గంధపు చెక్క<br>మధువులో ముంచి<br>పంచదార చిలక<br>పాళీగ మార్చి | కుంచె గీసినట్టి<br>కుడ్య చిత్రాలు<br>కుందనాల తెలుగు<br>అక్షరాలు |

# తెలుగు భాషా పరిమళాలు

- రమణ దుగ్గరాజు

క్రిందటి సంచికలో మిగిలిన శేషభాగం.....

మనకు తెలిసినంత వరకు తెలుగు కావ్యాల్లో చిత్రకవిత్వం తొలిసారిగా కన్పించేది నన్నెచోడుని "కుమారసంభవం" లో. ఇతను కూడ నన్నయ కాలానికి చాలా దగ్గరి వాడు. ఇతను నాగభూషణుడైన శివుణ్ణి ఒక నాగబంధ పద్యంలో స్తుతిస్తాడు; అంటే, కొన్ని చుట్టలు చుట్టుకున్న ఒక పాము బొమ్మ గీసి ఆ పాము శరీరం మీద అడ్డగళ్ళు పెట్టి ఒక్కో గళ్ళో ఒకో అక్షరం రాస్తారు; ఆ పాము తల నుంచి తోక వరకు వరసగా చదువుకుంటూ వెళ్తే పద్యం వస్తుంది. అలాగే చక్రధరుడైన విష్ణువుని ఒక చక్రబంధ పద్యంతో స్తుతిస్తాడు నన్నెచోడుడు. ఈ నాగబంధ, ఛురికా బంధ, ఖడ్గబంధ, చక్రబంధ పద్యాలను, ప్రాచీన కావ్యాలలో చదివాను. ముఖ్యంగా, వావిళ్ళ వారి ప్రచురణలలో, పుస్తకం చివరి పేజీల్లో బొమ్మలతో ఇచ్చేవారు.

నన్నెచోడుడే మరో పద్యంలో, "భక్తుడి శరీరంలో భగవంతుడు ఉంటాడు" అని చెప్తూ దానికి ఒక కందగర్భ చంపకమాలని వాడాడు (అంటే చంపకమాల పద్యంలో ఓ కందం కూడా ఇమిడి ఉంటుందన్న మాట!). ఆ పద్యం ఇది; చంపకమాల;
హరు మనమార గొల్చు; డరుదాతని గొల్చయు నాది బోడగా
బొరియును భూరి భోగ పుర భూతి విభుత్వము పొంది పేర్మితోన్
పరజన దారుణోగ్ర శరపాత నియుక్త పదంబు నందు తా
బొరయడు వారకోర్చి పొరి భూతగణేశ్వరు పొందు నాత్మలోన్

దీన్లో ఉన్న కంద పద్యం ఇది;
మనమార గొల్చు డరుదా
తని గొల్చయు నాది బోడగా బొరియును భూ
జన దారుణోగ్ర శరపా
తనియుక్త పదంబు నందు తా బొరయడువా!

భాగవతంలో పోతన గారు కొన్ని సర్వలఘు కందాల్ని రాశారు. వాటిలో గజేంద్రమోక్షణ ఘట్టంలో విష్ణువు ఏనుగుని రక్షించటానికి వెళ్ళేప్పుడు అతని వెనకే వెళ్తున్న లక్ష్మీదేవి మానసిక స్థితిని వర్ణించే "అడిగెద నని కడువడి జను.." అనే పద్యం ఆ సందర్భానికి అద్భుతంగా అతికింది. ఆ పద్యం ఇదుగో;

కందం:
అడిగెదనని కడువడి జను
నడిగిన దను మగుడ నుడుగడని నెడనుడుగున్
వెడవెడ చిడుముడి తడబడ
నడుగిడు నడుగిడదు జడిమనడుగిడునెడలన్

పోతన గారే రాసిన మరో సర్వలఘు కందం;
హరి హరి! సిరి యురమునగల
హరి హరిహయు కొరకు దనుజు నడుగగ జనియెన్
పరహిత రతమతి యుతులగు
దొరలకు నడుగుతలు నొడల తొడవులు పుడమిన్

ఇంతేకాదు, అష్టదిగ్గజ కవుల్లో, ప్రబంధాలు రాసిన వారిలో, పింగళి సూరన, భట్టుమూర్తిగా పిలిచే రామరాజభూషణుడు, ముక్కు తిమ్మనగా పేరొందిన నంది తిమ్మన భాషలో చాలానే ప్రయోగాలు చేశారు. ఉదాహరణకి, ముక్కుమీద పద్యం రాసి నంది తిమ్మన ముక్కు తిమ్మన అయ్యాడు. ఆ పద్యం ఇది;
శార్దూలం ;
నానాసూనవితాన వాసనల నానందించు సారంగ మే
లా నన్నొల్లదటంచు, గంధఫలి బల్కాకం తపంబంది యో
షానాసాకృతి బూని సర్వసుమనస్సౌరభ్యసంవాస మై
పూనెం బ్రేక్షణమాలికామధుకరీ పుంజంబునిర్వంకలన్

నంది తిమ్మన గారే అనులోమ, విలోమ కంద పద్యాలు రాసాడు;

నాయశరగసారవిరయ
తాయనజయసారసుభగధరధీనియమా
మాయనిధీరధగభసుర
సాయజనయతాయరవిరసాగరశయనా ! |అనులోమ విలోమ కందం|

మన అనే రెండు అక్షరాలతో తిమ్మన గారు రాసిందే :
కందం;
మనమున ననుమానము నూ
నను నీనామ మను మనుమననమును నేమ
మ్మున మాన నన్ను మన్నన
మను మను నానామునీనమానానూనా ! |ద్వ్యక్షరి కందము|

వీటిని చెపుతూనే, తెలుగులో వచ్చిన మరో భాషా ప్రయోగాలు చెప్పాలి. అవి, నిర్వచన కావ్యాలు, అచ్చ తెలుగు కావ్యాలూను. అంతే కాదు, నిరోష్ఠ్య పద్యాలు, (అంటే ప, ఫ, బ, భ, మ అనే అక్షరాలు లేకుండా) కావ్యాలు వచ్చాయి. తిక్కన (13 వ శతాబ్దంలో నిర్వచనోత్తర రామాయణం రాసాడు,( ఆంధ్ర మహాభారతం 13 పర్వాలు తెలుగులో రాయక ముందే). తిక్కన కాలంలోనే జీవించిన ఆయన శిష్యులు ; కేతన ; తెలుగులో మొదటి కథా కావ్యం రాసాడు ; దశ కుమార చరిత్ర. అది సంస్కృతంలో దండి మహాకవి రచనకి అనువాదం. దండినః పదలాలిత్యం అని పేరు. రొమాంటిక్ పోయెట్. తిక్కన మరో శిష్యుడు మారన తెలుగులో మొదటి మహాపురాణం రాసాడు, అది మార్కండేయ పురాణం. ఇందులోని కథల్లోంచే 16 వ శతాబ్దంలో పెద్దన మను చరిత్ర కథని తీసుకొన్నాడు.

నాచన సోమనాథుడు (13 వ శతాబ్ది) తన హరివంశం కావ్యంలో నిరోష్ఠ్య రాసాడు; ఆ పద్యం క్రింద ఇస్తున్నాను;

చని చని కాంచె నంత ఋషి సంహతి సారసకేసరాంతరా
సన సరసాళి సంగ దట చందన శాఖి చలత్తరంగ, గాం
చన సరసీజలార్ద్ర యతిసంచిత సైకతలింగ, గంగ, నం
జన గిరి గాఢ గంధ గజ సంగత శృంగ రథాంగ నత్తటిన్.

నాచన సోమన తిక్కన పేరు తన కావ్యం ఆశ్వాసాల్లో చెప్పి తిక్కనని గౌరవించాడు.

16 నుండి 18వ శతాబ్దాలలో తెలుగులో చాలా ప్రయోగాలు వచ్చాయి. పొట్లచెరువు అంటే నేటి పటాన్చెరువు వాడయిన పొన్నగంటి తెలగన్న తెలుగులో మొదటి అచ్చ తెనుగు కావ్యం యయాతి చరిత్ర రాసి , అప్పటి గోల్కొండ నవాబు ఇబ్రహీం కుతుబ్ షా సామంతుడు, పటాన్చెరువు ముస్లిం ప్రభువుకి అంకితం చేసాడు. ఇందులో సంస్కృత పదాలు ఏవి లేవు.

ఇక కావ్యాలలో ప్రయోగాలు; ప్రతి పద్యానికి రెండర్థాలు వచ్చే ద్వ్యర్థి కావ్యాలు, మూడర్థాలు వచ్చే త్ర్యర్థి కావ్యాలు వచ్చాయి. పింగళి సూరన "రాఘవపాండవీయం" అనే ద్వ్యర్థి కావ్యం రాశాడు. అంటే ప్రతి పద్యంలోనూ రామాయణానికి సంబంధించిన అర్థం ఒకటి, భారతానికి సంబంధించిన అర్థం మరోటి ఉంటాయన్న మాట. భట్టుమూర్తిగా ప్రసిద్ధి కెక్కిన రామరాజభూషణుడు వసుచరిత్రతో పాటుగా, హరిశ్చంద్ర నలోపాఖ్యానం అనే ద్వ్యర్థి కావ్యం రాసాడు. సారంగధరీయము అనే త్ర్యర్థి కావ్యాన్ని పోకూరి కాశీపతి అవధాని గద్వాల సంస్థానంలో 20వ శతాబ్దం తొలినాళ్ళలో రాశాడు. దీన్ని తెలుగువిశ్వవిద్యాలయం వారు 1990లో ప్రచురించారు. ఇందులో పార్వతీ కల్యాణం, తారాశశాకం, సారంగధర కథ కలిసి ఉంటాయి.

అయితే పింగళి సూరన " కళాపూర్ణోదయం" లో చేసిన ప్రయోగాలు సందర్భానుకూలంగా ఉండి కొంతవరకు ఉల్లాసాన్ని కలిగించగలవు. నలుగురు కవులు ఓ రాజుని చూట్టానికి వెళ్తే ఒక మంత్రి వాళ్ళకి అడ్డు తగుల్తుంటాడు. ఇలా కాదని వాళ్ళు పల్లెటూరి వాళ్ళ వేషాల్లో ఆ రాజు దగ్గరికెళ్ళి ఓ పద్యం చెప్తారు.

మాయమ్మా న సు నీవే
రాయలపై కావ దేవరా జేజేజే
మాయాతుము లానిన యది
పాయక సంతోసమున్న ఫల మిలసామీ

చదువేమీ రాని వాళ్ళ మాటల్లా అనిపించే ఈ పద్యం నిజానికి తెలుగు పద్యం గానూ, సంస్కృత శ్లోకం గానూ కూడా చదువుకోవచ్చు. ముందుగా, తెలుగు పద్యానికి అన్వయం ఇది;

దేవరా, జేజేజే,
ఇలసామీ (భూమిని పాలించే వాడా),
నీవే రాయలపై కావ, సంతోసము,
పాయక (విడవకుండా),
మాయాతుములు (మా ఆత్మలు),
ఆనినయది (తాకింది),ఉన్న ఫలము, మాయమ్మ, ఆన, సు!

ఇదే పద్యం సంస్కృతంలో అయితే హే, సునీవే (శుభప్రదమైన మూలధనము కలవాడా), ఆయమ్ (రాబడిని), మామాన (లెక్కపెట్టుకో వద్దు), అలవా (ముక్కలు కాని), రాః (ధనము), ఏకైవ (ఒక్కటే), అవత్ (కష్టాల్లో రక్షించేది); అజేజే (యజ్ఞం చేసే), రాజే (రాజు కోసం), మా (లక్ష్మి), ఆయాతు (వస్తుంది), మలాని న (పాపాలు అంటవు); పాయక (ఓ రక్షకుడా), సః (మంచివాళ్ళు), యది (దర్శనానికొస్తే), అసముత్ (సంతోషం లేకుండా), నఫల (వాళ్ళని చూడకుండా ఉండొద్దు), మిల (వాళ్ళతో కలువు), అమీ (వచ్చిన మేము), సా (ఆ లక్ష్మీ దేవే అనుకో) ఇంత వ్యవహారం ఉంది ఆ చిన్ని కందంలో!

అదే సందర్భంలో మరో వింతైన పద్యం

తా వినువారికి సరవిగ
భావనతో నానునతి విభా వసుతేజా
దేవర గౌరవ మహిమన
మా వలసిన కవిత మరిగి మాకు నధీశా

దీన్ని తిరగేస్తే ఓ సంస్కృత శ్లోకం ఔతుంది!

శాధీనకు మా గిరి మత
వికనసి లవమాన మహిమ వర గౌరవ దే
జాతే సువ భావి తినను
నాతో నవభాగ విరస కిరివానువితా

"ఉషాపరిణయం" లో దామెరల అంకన్న ఒక కందపద్యంలో 108 కందాల్ని బంధించాడు. అంటే, ఏ అక్షరం దగ్గర మొదలై ముందుకు వెళ్ళినా, వెనక్కి వెళ్ళినా ఓ కందం వస్తుందన్న మాట. అలాగే, గణపవరపు వేంకటకవి "ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసం" అనే కావ్యం రాశాడు. దీన్లో ఇతను చెయ్యని చిత్రకవితా ప్రదర్శనం లేదు. వెయ్యి పైగా పద్యాల్ని ఇముడ్చుకున్న ఓ సీసం కూడా ఉన్నదిందులో!

ఆ తర్వాత ఇంకా ఎన్నో చిత్రకవితా విశేషాల్తో కావ్యాలొచ్చాయి. ఉదాహరణకి రావిపాటి లక్ష్మీనారాయణ "భారతగర్భ రామాయణం" లో పద్యాలు రామాయణార్థంలో ఉంటే ప్రతి పద్యంలోను ఇమిడి ఉన్న మరో పద్యం భారతార్థాన్నిస్తుంది!

ఇలా ఎన్నో రకాల చిత్ర విచిత్ర పాండిత్య విన్యాసాలు సాగేయి మన చిత్రకవిత్వం లో. వందల కొద్దీ చిత్రాలు గీసుకుని వాటిలో పట్టే పద్యాల్ని తయారు చేశారు అసలు నిజమైన చిత్రకవిత ఇదేనంటారు కొందరు. ఈ ప్రక్రియలో కవి కంట బడ్డ ఏ వస్తువైనా చిత్రకవితకి అర్హమే! గుళ్ళు, గోపురాలు, రథాలు, చక్రాలు, ఖడ్గాలు, ఛురికలు, చెట్లు, సర్పాలు, గోవులు (గోమూత్రం కూడా), కోతులు, ఇంకా ఎన్నెన్నో ఆకారాలు చిత్రకవిత్వానికి పనికొచ్చినాయి.
గర్భకవిత్వంలో సీసపద్యంలో రకరకాల యితర ఛందాల్ని బంధించటం, చంపకమాల, ఉత్పలమాలల్లో కందాల్నీ గీతాల్నీ ఇరికించటం, ఇలా ఎన్నెన్నో ప్రయోగాలు జరిగేయి. "ప్రతిపద్యమ్మున చమత్కృతి చెప్ప నేర్తు" అని శపథం పట్టి చేమకూర వెంకట కవి, తన విజయ విలాస కావ్యంలో చాలా భాషా ప్రయోగాలు చేసాడు. అవి చదివితే వచ్చే ఆనందం అంతా ఇంతా కాదు.

గూఢకవిత్వం అని మరో శాఖ ఉంది. ప్రతిపాదం మొదటి అక్షరాల్ని కలిపితే ఏదో విశేషమైన పదం రావటం ఇలాటిది (ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసం లో ఓ సీస పద్యం మొదటి అక్షరాలు "వేంకటేశ్వర విలాసం" అయితే, అదే పద్యంలో పాదాల చివరి అక్షరాలు "వేంకటకవి" ఇస్తాయి). ఇంకొందరి పద్యాల్లో మొదటి మూడు పాదాల్లో అక్కడక్కడ ఉన్న పదాల్ని కలిపితే నాలుగో పాదం వస్తుంది. సరి అక్షరాల్ని ఓ చోట పెడితే ఓ పాదం (లేదా పాదభాగం), బేసి అక్షరాల్లో మరో పాదం (లేక భాగం) రప్పించటం మరో పద్ధతి. ఇలా ఎన్నో రకాలైన గూఢకవితా చమత్కారాలున్నాయి.
అందాకా ఎందుకు మా తాతగారు కూడా కొంత చిత్ర/గూఢ కవిత్వం రాసారు. ఆయన, కొప్పరపు సోదరకవులు అనే, అవధానులకి శిష్యుడు, మిత్రుడు. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు ఆరోజుల్లో గొప్ప పండితుడు; ఆయనతో కలసి కొన్నాళ్ళు పనిచేశారు. నాకు దొరికిన మా తాత గారి పుస్తకాల్లో, ఒక శతకంలో, మొదటి 10 పద్యాల్లో మొదటి అక్షరాలు కలిపితే, అందులో, శతక మకుటం, రచయిత పేరులో కొన్ని అక్షరాలు వస్తాయి.

ఇలా చెప్పుకొంటూ పోతే ఇంకా చాలా ఉన్నాయి. ఆరుద్ర, శ్రీ శ్రీ, పట్టాభి, లాంటి కవులు ఆధునిక కాలంలో ప్రయోగాలు చేశారు. వేటూరి సుందరరామమూర్తి గారు సినిమా పాటల్లోనే ప్రయోగాలు చేశారు. అదంతా మరో ఉద్గ్రంథం అవుతుంది.

అమెరికాలో యూనివర్సిటీ అఫ్ కాలిఫోర్నియా తెలుగు విభాగంలో తెలుగు భాషను బోధిస్తున్నారు. అలాగే ఇటీవల ఎమొరీ యూనివర్సిటీలో కూడా తెలుగు బోధన ప్రారంభించారు. హార్వర్డ్ యూనివర్సిటీలో ఇంకా మౌంట్ హోలీయొక్ కాలేజ్ సంస్కృత భాషను బోధిస్తున్నారు. తెలుగు భాష శిక్షణలో నిర్విరామంగా కృషి చేస్తున్న శిశుభారతి మరియు మన బడి సంస్థల పట్టుదల ప్రశంశనీయం.

ఈమాట ఆన్ లైన్ లింక్ వ్యాసంలోంచి కూడా చాలా సమాచారాన్ని ఇందులో వాడుకున్నాను. వారికి కృతజ్ఞతలు.

**Online resources:**

http://www.madhuravani.com/
http://kinige.com/kbrowse.php?via=categories&cid=5
http://www.avkf.org/BookLink/book_link_index.php
http://pusthakalu.info/telugu-novels
http://www.koumudi.net/
http://www.koumudi.net/books/koumudi_antarangalu.pdf

http://www.telugushortfilmz.com/swathi-weekly-17th-june-2016/
https://www.facebook.com/telugushortfilmzcom/
http://www.andhrabharati.com/bhAshha/index.html
https://sarasabharati-vuyyuru.com/
http://sailajachandu.blogspot.com/2012/02/blog-post_20.html
http://koodali.org/blogs/select
http://chellayi.blogspot.com/2010/07/blog-post.html
http://deeptidhaara.blogspot.com/
https://veeven.wordpress.com/2007/08/17/top10-telugu-blogs/
http://eemaata.com/em/ (this site has very good interesting info )
http://www.telugusahityam.com/ (this has interesting anecdotes from famous Telugu litterateurs)
http://www.teluguone.com/sahityam/ (this has very good classic and modern Telugu poetry and novels)

## Green Team Introduction

పర్యావరణం లేనిదే మనిషి లేడు. మన జీవనాధారమైన పర్యావరణాన్ని మనం కొన్ని వందల ఏళ్ళుగా జీవికకే కాకుండా మితిమీరిన స్వార్థానికి కొన్ని సందర్భాలలో కేవలం మన సౌలభ్యానికీ విశృంఖలంగాను అక్రమంగాను దుర్వినియోగ పరుస్తున్నాము, కలుషితం చేస్తున్నాము. వికాసాన్ని వెతుకుతూ పురోగమించిన పథంలో సాధించిన అద్భుతమైన అభివృద్ధిలో మనకు అడుగు అడుగునా దన్నుగా వున్న పర్యవరణానికి మనం చూపింది మొండిచెయ్యేనన్నది కాదలేని సత్యం. ఆ బాధ్యతారాహిత్య ప్రవర్తనకు గాను పర్యవసానాలను ప్రపంచమంతటా చూస్తున్నాము అనుభవిస్తున్నాము కూడా! ఇది ఇలాగే సాగితే ముందుతరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, నేల, సమంగా సాగే ఋతువులు లేకుండా చేసిన తరమన్న ఖ్యాతి మన ఖాతాలో పడుతుంది! పర్యావరణ పరిరక్షణ కోసం 'ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ' కాకుండా ఎవరికివారు ముందు కుటుంబస్థాయిలోను తరువాత సమాజస్థాయిలోను అత్యంత ఆవశ్యకమైన ఆ బాధ్యతని భుజాలకి ఎత్తుకోవాలని హరిత బృందం సంకల్పించుకుంది.  ఆ ఆశయానికి సహృదయంతో ఊత నిచ్చిన TAGBకి, తోడైనిలుస్తామంటూ నడుంకట్టి వచ్చిన మిత్రులకి, స్వచ్ఛందసేవ చేస్తూ చేయూతనందిస్తున్న చిన్నారులకి శతకోటి వందనాలు!!

పేరు: ప్రతిమ పెనుమర్తి

ఊరు: ఈస్టన్, MA

అభిరుచులు:ఇంజనీరింగు పట్టా పుచ్చుకున్నప్పటికీ బోధనపై ఉన్న మక్కువతో విద్యారంగంలో ఉన్నతవిద్యని అభ్యసించాను. ప్రస్తుతం సొంతంగా Ho Math & Chess-Easton విద్యాసంస్థని విజయవంతంగా నడుపుతున్నాను. కేవలం చదువు చెప్పటమే కాకుండా జీవితానికి కావాల్సిన పాఠాలు చెప్పటం నా ఆశయం. ఈస్టన్ మానవ హక్కుల పరిరక్షణ సంఘం మరియు Lions Club లో కీలకమయిన బాధ్యతలను నిర్వహిస్తున్నాను. ఖాళీ దొరికినప్పుడు పుస్తకాలు చదవటం, సినిమాలు చూడటం, స్నేహితులని కలవడం, మ్యూజియంలకి వెళ్ళడం ఇష్టం. అలాగే Einstein, మా golden retriever తో ఆడుకోవటం కూడా!

TAGB తో నా అనుబంధం: మనమంతా సంఘటితంగా వుంటే సాధించలేనిది ఏమీవుండదని మనస్ఫూర్తిగా

నమ్ముతాను. TAGB పలు సాంస్కృతిక సామాజిక కార్యక్రమాలతో తెలుగు వాళ్ళకి చేస్తున్న సేవలో ఆ నమ్మకం నిజం అవ్వటం చూసి గత రెండు సంవత్సరాలుగా స్వచ్ఛందంగా కార్యకర్తగా పని చేస్తున్నాను. దీని ద్వారా సృజనాత్మకతకి పదును పెట్టుకుని ఆత్మవిశ్వాసాన్ని పెంచుకునే అవకాశాలు చాలా వచ్చాయి, చాలా ఆనందంగా వుంది. TAGB ఇలాగే అమెరికాకి ఇండియాకి మధ్య వారధిలా వుండి తెలుగువాళ్ళ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరుకుంటున్నాను.

పేరు: అనిత బాచిన

ఊరు: షారన్, MA

అభిరుచులు:కళాత్మకమైన వస్తువులు తయారుచెయ్యటం, Event Decoration and Planning, Bighelp and TAGB ద్వారా సంఘసేవ చెయ్యటం

TAGB తో నా అనుబంధం: విశాఖపట్నంలో పుట్టి పెరిగినా దశాబ్దంపైగా బోస్టన్ పరిసర ప్రాంతాలలో నివాసం. మన నేలకి మన భాషకి దూరంగా పిల్లలని పెంచుకుంటున్న మాలాంటి వారికి ఎందరికో TAGB సంస్కృతి పరంగా సామాజికంగా చేసిన సహాయం మరువలేనిది. తెలుగు సంఘాలలో ప్రత్యేకంగా నిలిచే TAGB లో సభ్యులమైనందుకు గర్వంగా వుంటుంది. మిత్రుల ప్రేరణతో హరిత బృందంలోను పోటీల బృందంలోను చేరి నా వంతు సహాయం చేస్తున్నాను. ఎప్పటికప్పుడు పర్యావరణానికి గాని పిల్లలకి గాని ఇంకా ఏమి చెయ్యవచ్చు ఏ విధంగా మెరుగుపరచవచ్చు అని ఆలోచన చేస్తుంటాను. తెలుగు వాళ్ళు అందరు భాషని సంస్కృతిని సాంప్రదాయాన్ని కాపాడుకుంటూ ఎప్పుడూ కలిసి వుండాలని కోరుకుంటున్నాను.

పేరు: ఉమ ఏలూరి

ఊరు: నాషువా, NH

అభిరుచులు: పచ్చని మొక్కలు, పండు వెన్నెలలు, నచ్చిన నెచ్చెలులు, మెచ్చిన పుస్తకాలు, నెమలిపింఛెము వాడు ఇలా రాసుకుంటూపోతే చాలా వున్నాయి!

TAGBతో నా అనుబంధం: ప్రవాస జీవితంలో స్నేహితాలు మొదలవ్వటానికి, స్నేహం అనుబంధంగా పరిణమించటానికి, మన మూల వేళ్ళలోని చెమ్మ ఎండకుండా సరదాల సాంప్రదాయాల చిరుమల్లెలను పూయించే ప్రక్రియలో సహాయపడిన మన TAGBకి నీరాజనాలు. హరిత బృందం ఆశయాలు నచ్చి చేతనైన సహాయం చేద్దామని చేరాను. పచ్చని చెట్టు తోడుగా నడుద్దాము - పలకరించే ప్రకృతిని ప్రేమిద్దాము - సహజ వనరులను కాపాడుకుందాము!!

పేర్లు: చంద్ర కమ్మ & మాధవి కమ్మ

ఊరు: నార్వుడ్, MA

కలసికట్టు అభిరుచులు: సంగీతం ఆస్వాదించటం, సినిమాలు చూడటం, విహారయాత్రలు చేయటం

TAGBతో మా అనుబంధం: గత పదిహేనేళ్ళుగా సభ్యులం, సంస్థ నిర్వహించే కార్యక్రమాలకు మిత్రులతో కలిసి సాధ్యమైనంత వరకు క్రమంతప్పకుండా హాజరు అవుతాము. అడపదడపా స్టేజిపై నాటకాలు కూడా వేస్తుంటాము. TAGB ఇక్కడ వుండే ప్రతి ప్రవాస తెలుగు కుటుంబానికి ఎడారిలో నీటిచెలమ లాంటిదని మా భావన. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి కనీస బాధ్యత అని గుర్తెరిగిననాటి నుంచి ఇంటా బయటా చెత్త తగ్గించేందుకు, Recycling సజావుగా జరిగేందుకు కృషి చేస్తున్నాము. స్వతహాగా కొంత ఆనాకర్షణీయంగా

కొన్ని సార్లు కాస్త జుగుప్సాకరంగానూ వుండే ఈ పనులకి సైతం సాయంచేస్తున్న మిత్రులకి, దన్నుగా నిలబడిన TAGBకి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. పర్యావరణ పరిరక్షణా మార్గాలు అందరికి తెలియచెప్పటం ముఖ్యంగా మన పిల్లలకి వాటి విలువ నేర్పి వారికి మార్గదర్శకత్వం చేయటం మా ఆశయాలు.  ఈ భూమండలం - మన పూర్వికుల నుండి వారసత్వం కాదు - మన ముందు తరాలనుంచి తెచ్చుకున్న ఋణము!

## Competitions Committee Introduction

పేరు: చిలకమర్రి సత్య రాజా
ఊరు: షారన్, MA
అభిరుచులు: ప్రతిభావంతుల సాంగత్యానికి అవకాశం వచ్చే పని చెయ్యడం. టి.ఏ.జి.బి నన్ను ఆదరించి, అవకాశాల్ని ఇచ్చి,సరిదిద్దుతున్నది. సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం, నిర్వహించడం.
బోస్టన్ పరిసర ప్రాంతాల తెలుగు సంఘం తో నా అనుబంధం: 10సం. గా టి.ఏ.జి.బి నన్ను ఆదరించి, అవకాశాల్ని ఇచ్చి,సరిదిద్దుతున్నది. కార్యవర్గంలో చొరబడి పదవుల సుఖం పొందుతూ, సేవాభావం ఉన్న మహనీయుల ద్వారా క్రొత్తవిషయాలని తెలుసుకోవడం జరుగుతున్నది.



పేరు: దీప్తి గోరా
ఊరు: వాల్ పోల్, MA
అభిరుచులు: మంచి సాహిత్యం చదవడం, ఆస్వాదించడం- నలుగిరితో పంచుకోవడం. రంగస్థల కార్యక్రమాలు ప్రోత్సహించడం- పాలుపంచుకోవడం. రాయడం. క్రికెట్ మరియు ఇతర క్రీడలు చూడడం సమీక్షలు చేయడం.
బోస్టన్ పరిసర ప్రాంతాల తెలుగు సంఘం తో నా అనుబంధం :ఈ అనుబంధం సుధీర్ఘమైనది. 2002 నుండి సంస్థతో అనుబంధం వుంది. వున్న వూరికి సొంత మనుషులకి దూరంగా వున్న వారిని మనతనంతో సొంతమనుషుల్ని చేసుకొన్నది మన TAGB. ఇక్కడ కూడా తెలుగు భాష మాధుర్యం- తెలుగు తనమనే పరిమళం నిత్యం భాసిల్లెలా చేయడానికి మనందరిని ఒక తాటి మీదికి తెచ్చింది.



పేరు:  రేఖ గుండిమెడ
ఊరు: ఫ్రాన్ క్లిన్, MA.
అభిరుచులు: వండుట, పాడుట, తోటపనిచేయుట మరియు చదువుట.
బోస్టన్ పరిసర ప్రాంతాల తెలుగు సంఘంతో నా అనుబంధం: గత 20 సంవత్సరములుగా బోస్టన్ ప్రాంతంలో నివసిస్తూ, మన తెలుగు సంఘం సభ్యుల్లో భాగమైనందుకు గర్వంగా ఉంది.  ఇది ఒక పెద్ద తెలుగు కుటుంబంగా పెరుగుతూ, ఒకరికొకరు సమయానుకూలంగా సహాయ సహకారాలు అందిపుచ్చుకోవటం చూశాను.  రెండు సంవత్సరాల క్రితం పోటీలు నిర్వహించే కార్యవర్గంలో చేరాను, శక్తి వంచన లేకుండా తిరిగి పెద్ద సంఖ్య లో ప్రతి తెలుగు వారు లబ్ది పొందాలని.  నన్ను టి.ఏ.జి.బి. లో పోటీలు నిర్వహించే కార్యవర్గానికి పరిచయము చేసిన శ్రీ రాజా చిలకమర్రి గారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు

తెలియచేస్తున్నాను.